పత్రికా ప్రకటన - 1

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదీః 13.08.2014

నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లో రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ) ఆధ్వర్యంలో రూ. 1600 కోట్ల వ్యయంతో త్వరలోనే ఓ ముఖ్యమైన విభాగాన్ని నెలకొల్పనున్నారు.

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సచివాలయంలో బుధవారం ఈ విషయానికి సంబంధించి నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, ప్రభుత్వ సలహాదారు కెవి.రమణాచారి, రెవెన్యూ శాఖ కార్యదర్శి మీనా, ఇరిగేషన్ కార్యదర్శి జోషి, సిఎంఒ ముఖ్య కార్యదర్శి ఎస్.నర్సింగ్ రావు తదితరులతో కలిసి సమీక్ష నిర్వహించారు. భారత దేశంలో అనేక ప్రాంతాల్లో ఈ విభాగాన్ని నెలకొల్పడానికి సరైన స్థలం కోసం అన్వేషించారని అన్నిటికన్నా నాగార్జునసాగర్ అనువైన ప్రాంతంగా రక్షణ శాఖ అధికారులు గుర్తించారని ముఖ్యమంత్రి చెప్పారు. భారతదేశంలో ఇలాంటి యూనిట్ మరెక్కడా లేదు. ప్రపంచంలోనే కేవలం 5 దేశాల్లో ఇలాంటి విభాగం వుంది. ప్రస్తుతం భారత రక్షణ శాఖ తన అవసరాల కోసం మాస్కోలో వున్న యూనిట్ పై ఆధారపడుతోందని, నాగార్జునసాగర్‌లో యూనిట్ నెలకొల్పడం ద్వారా వేరే దేశాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. కేవలం భారత దేశ అవసరాలే కాకుండా మరికొన్ని దేశాలకు కూడా పరిశోధనలకు కావలసిన సహకారం ఈ యూనిట్ ద్వారా అందించనున్నట్లు వెల్లడించారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన యూనిట్‌ను తెలంగాణలో నెలకొల్పాలని రక్షణ శాఖ నిర్ణయించుకోవడం పట్ల ముఖ్యమంత్రి ఆనందం వ్యక్తం చేశారు. పరిశ్రమలు, ప్రతిష్టాత్మకమైన సంస్థలు, ముఖ్యమైన విభాగాలను తెలంగాణలో నెలకొల్పాలని అందరూ భావిస్తున్నారని, ఇది తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో దోహదం చేసే అంశమని ముఖ్యమంత్రి చెప్పారు. నాగార్జునసాగర్ ప్రాంతంలో ఈ యూనిట్ నెలకొల్పడానికి 100 ఎకరాల స్థలం కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. యూనిట్‌కు అవసరమయ్యే నీరు, విద్యుత్‌ను కూడా అందించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని కేసిఆర్ వెల్లడించారు. అన్ని అనుమతులు వెంటనే ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నాగార్జునసాగర్ పరిధిలో రక్షణ శాఖ మరిన్ని పరిశోధనలు చేయడానికి, మరికొన్ని సంస్థలు నెలకొల్పడానికి అనువుగా

మరింత స్థలాన్ని కూడా రక్షణ శాఖకు కేటాయించడానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. రూ. 1600 కోట్లతో స్థాపించే యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మందికి ఉపాధి దొరుకుతుందని, నాగార్జునసాగర్ ప్రతిష్ట కూడా పెరుగుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు కూడా ఈ యూనిట్ ఉపయోగపడుతుందని, వృత్తి నైపుణ్యం పెంచుకోవడం సాధ్యపడుతుందని వెల్లడించారు.

ప్రతిష్టాత్మకమైన యూనిట్ పెడుతున్నందున దేశ విదేశాల నుండి శాస్త్రవేత్తలు, ఇతర నిపుణులు, అధికారులు ఇక్కడికి రాకపోకలు సాగిస్తారని వారికి సౌకర్యంగా వుండేందుకు నాగార్జునసాగర్‌లో విమానం దిగడానికి అవసరమైన రన్ వే కూడా నిర్మించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ రన్ వే (ఎయిర్ స్ట్రిప్)ను కేవలం రక్షణ శాఖ అవసరాలకే కాకుండా పర్యాటకులు కూడా వచ్చిపోయేందుకు వినియోగించాలని చెప్పారు.

---

**సిపిఆర్ఓ టు సిఎం**